క్లుప్తంగా

24 గంటలలో బోరు ఏర్పాటు

మంగళగిరి: రత్నాల చెరువు ప్రాంతంలో నూతన బోరును కార్పొరేషన్ అధికారులు బుధవారం ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) మంగళవారం సాయంత్రం రత్నాల చెరువులో నూతనంగా నిర్మాణం జరుపుకుంటున్న రోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. అక్కడ స్థానిక మహిళలు నీటి సమస్య అధికంగా ఉందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే బోరు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. 24 గంటలు గడవక ముందే తమ వీధిలో బోరు ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ క్రాప్‌పై గ్రామ సభలను వినియోగించుకోండి

మంగళగిరి: ఈ క్రాప్ నమోదుపై అవగాహన కోసం నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ జి.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రైతు భరోసా కేంద్రాల వద్ద ఈనెల 13 నుంచి నిర్వహిస్తుండగా 17 వరకు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు జాబితా ప్రదర్శించనున్నట్లు చెప్పారు. అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలోని తాడేపల్లి, తుళ్లూరు, తాడికొండ మండలాల రైతుల కొరకు అన్ని రైతు భరోసా కేంద్రాలలో 2022-23 ఈ క్రాప్ ముసాయిదాను ఈ నెల 10వ తేదీన ప్రదర్శించినట్లు తెలిపారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



మంగళగిరి: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. నగర పరిధిలోని పార్కురోడ్డులోని ఎస్సీ, ఎస్టీ రైట్స్ యాక్ట్స్ కార్యాలయంలో ప్రజా సంఘాల నాయకులు కాన్షీరామ్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కారుమంచి రామారావు, గరికముక్కు డేవిడ్, బచ్చల రమేష్‌బాబు, కలకోటి నాగేశ్వరరావు, కుర్రా ఏడుకొండలు పాల్గొన్నారు.

పోలీస్ పేరుతో మహిళకు బెదిరింపు ఫోన్

మంగళగిరి: నగర పరిధిలో పెదవడ్లపూడిలో ప్రింటింగ్ ప్రెస్ నడుపుతున్న మహిళకు పోలీస్ పేరుతో ఫోన్ కాల్‌లో బెదిరించిన ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. పెదవడ్లపూడికి చెందిన వడ్లపాటి యువరాణి వడ్లపూడిలో ప్రింటింగ్ ప్రెస్ నడుపుతోంది. బుధవారం ఉదయం తన ఫోన్‌కు తెలియని నంబర్ నుంచి ఒక వ్యక్తి ఫోన్ చేసి తాను భీమవరం పోలీస్ స్టేషన్ నుంచి రైటర్‌ను మాట్లాడుతున్నానని మీ భర్త ఉన్నారా అని ప్రశ్నించారు. తన భర్తతో మీకేంటి పని అని మహిళ నిలదీయగా ఫోన్ చేసిన వ్యక్తి దుర్భాషలాడడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో యువరాణి రూరల్ పోలీసులకు తనకు వచ్చిన ఫోన్ నంబర్ ఆధారంగా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముస్లిం సంఘాలతో సీఎం జగన్ సమావేశం హర్షణీయం

తాడేపల్లి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం హర్షణీయమని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని పేర్కొన్నారు. బుధవారం దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మదరసాలలో పనిచేసే విద్యా వలంటీర్ల జీతాల సమస్యను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడంతో పాటు ఉర్దూ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నాటికి బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్‌లో భాగంగా ఇంగ్లిష్‌తో పాటు ఉర్దూలో కూడా ఉండేలా చర్యలు చేపట్టడంతో వారికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ గఫూర్, పఠాన్ మస్తాన్ ఖాన్, షేక్ బాజీ బాబా పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న కార్మిక కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇందిర, మార్తమ్మ, వెంకయమ్మ, భూలక్ష్మి, దుర్గ, సుశీల, వై.రాఘవులు పాల్గొన్నారు.

జనసేన సీఎం అభ్యర్థిగా బీసీని ప్రకటించాలి

మంగళగిరి: పవన్ కల్యాణ్‌కు బీసీలపై ప్రేమ ఉంటే సీఎం అభ్యర్థిగా బీసీలను ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం స్టేట్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పాల రాజ్‌కిరణ్ డిమాండ్ చేశారు. నగరంలో కార్పొరేషన్ పక్కన ఉన్న ఐబీఎస్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల పవన్ కల్యాణ్ బీసీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో బీసీ అభివృద్ధి గురించి రాజ్యాధికారం గురించి అనేక విషయాలు చర్చించారని, ప్రేమ ఉంటే సీఎం అభ్యర్థిగా బీసీలను ప్రకటించాలని కోరారు.

టెంపుల్ హిల్ ఏకో పార్కుకు
మరిన్ని హంగులు



పార్కు కొండపై నిర్మిస్తున్న మోగా ధ్యాన కేంద్రం



ఏకో పార్కు ముఖద్వారం వద్ద చేపట్టనున్న పార్కు నిర్మాణ పనులు

మంగళగిరి: టెంపుల్ హిల్ ఏకో పార్కుకు మరిన్ని హంగులు సమకూరనున్నాయి. మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదాన్ని అందించేలా ఎయిమ్స్ ఆస్పత్రి పక్కన టెంపుల్ హిల్ ఏకో పార్కును తీర్చిదిద్దుతోంది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచనలతో అటవీశాఖ అధికారులు రూ.40 లక్షలతో పార్కు కొండపైన నిర్మాణం చేసి ట్రెక్కింగ్ పార్కుతో పాటు ధ్యాన, యోగా కేంద్రాలు, సేదతీరేందుకు బల్లలు, రాళ్ల అమర్చుతున్నారు. ఇప్పటికే వాకింగ్, వ్యాయామం చేసేందుకు వచ్చే నగర ప్రజలకు ఓపెన్ జిమ్, కుటీరాలు, వాకింగ్ ట్రాక్, ట్రెక్కింగ్ ట్రాక్, వివిధ రకాల ఔషధ గుణాలు కలిగిన మొక్కలతో వివిధ పేర్లతో వనాలను ఏర్పాటు చేశారు. నూతనంగా ధ్యాన యోగా కేంద్రాలు, ఏదైనా సమావేశాలు ఏర్పాటు చేసుకునేలా సమావేశమందిరాలు వాటి చుట్టూ ఔషధ గుణాలు కలిగిన మొక్కలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారి మధుసూదనరెడ్డితో పాటు అధికారులు కొందరు ఇదే ప్రాంతంలో నివాసం ఉంటుండడంతో ప్రతి రోజు అధికారులు వాకింగ్ చేసేందుకు వచ్చి ఆయా నిర్మాణాల పనులు పరిశీలించి పలు సూచనలు చేస్తుండడంతో పనులు చకచకా కొనసాగుతున్నాయి.

రైల్వే రెండో లైన్‌కోసం స్థలం పరిశీలన



మంగళగిరిపాడు సచివాయంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామ శివారులోని గుంటూరు -గుంతకల్లు రెండోలైన్ కోసం కావల్సిన ప్రభుత్వ భూమిని బుధవారం జేసీ రాజకుమారి పరిశీలించారు. రెండో నిర్మాణ కోసం కొంత ప్రభుత్వ, ప్రైవేటు భూములు కేటాయించాలని కోరుతు రైల్వే అధికారులు కోరడంతో ఆ భూములను, రైల్వే ట్రాక్ వద్ద ఉన్న పరిసరాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఇటీవల ఫిరంగిపురంలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను ఆమె పరిశీలించారు. మార్టులోని వస్తువులు ఏర్పాటు చేసిన తీరు, అమ్మకం వివరాలు సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. మార్టును మరింతగా అభివృద్ధిలోకి తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఆమె వెంట తహసీల్దార్ పద్మనాభుడు ఉన్నారు.

మంగళగిరిపాడు గ్రామ సచివాలయం తనిఖీ

మేడికొండూరు: మండలంలోని మంగళగిరిపాడు గ్రామ సచివాలయాన్ని గుంటూరు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి బుధవారవం ఆకస్మికంగా తనిఖీచేశారు. భూ రీసర్వేలో భాగంగా గ్రామంలో కొన్ని దశాబ్దాల కాలం నుంచి రైతులకు ఇబ్బంది గా ఉన్న ఈనాం భూములపై గ్రామ రైతులతో మాట్లాడారు. భూ రీసర్వేలో గ్రామ రైతులు అధికారులకు సహకరించి తమ పొలాలను ఆన్‌లైన్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, సర్వే ఏడీ రూప్లానాయక్, తహసీల్దార్ జి.కరుణకుమార్ పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన తరువాతే ఎన్నికలకు

- వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్
- మల్కాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం



మల్కాపురంలో సమస్యలు తెలుసుకుంటున్న కత్తెర సురేష్ కుమార్

మల్కాపురం(తాడికొండ): ఎన్నికలకు ముందు ఇచ్చి ప్రతి హామీని నెరవేర్చిన తరువాతే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. తుళ్ళూరు మండలం మల్కాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం బుధవారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మాట తప్పకుండా ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏపీలో ప్రతి పేదవాడికి అవసరాలను గుర్తించి సంక్షేమం ద్వారా లబ్ధి చేకూరుస్తున్నాడన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



సీకే జూనియర్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలం

మంగళగిరి: నగర పరిధిలో మూడు కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహణకు కేంద్రాలుగా అధికారులు ఏర్పాటు చేశారు. మెయిన్ బజార్‌లోని కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న సీకే జూనియర్ కళాశాల, కొత్తపేటలోని నిర్మల జూనియర్ కళాశాల, వడ్లపూడి సెంటర్‌లోని నారాయణ కళాశాలలను కేంద్రాలుగా ఏర్పాటు చేయగా బుధవారం ఉదయం నుంచే ఆయా కేంద్రాలు విద్యార్థులు తల్లిదండ్రులతో కోలాహలంగా మారాయి. తొమ్మిది గంటలు దాటి ఒక్క నిముషం ఆలస్యం అయినా అనుమతించమని అధికారులు స్పష్టం చేయడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ముందు జాగ్రత్తగా ఉదయం 8గంటల నుంచే కేంద్రాలకు చేరుకున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దీనాపూర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఉదయాన్నే 9 గంటలకు ముందే స్థానిక మార్నింగ్‌స్టార్ కళాశాల విద్యార్థులు 284 మంది, స్థానిక దీనాపూర్ కళాశాలకు చెందిన 162 మంది విద్యార్థులు పరీక్ష కేంద్రానికి హాజరయ్యారు. పరీక్షలు జరిగే సమయంలో కళాశాల బయట ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా స్థానిక పోలీసులను ఏర్పాటుచేశారు.

ఎన్‌ఆర్‌ఐ వద్ద కాలువలో చెత్త తొలగింపు

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి వద్ద మురుగు కాలువలో చెత్త తొలగింపు పనులు బుధవారం చేపట్టారు. నగరంలోని మురుగు నీరు ఎన్‌ఆర్‌ఐ వద్ద మురుగు కాలువకు చేరి అటు నుంచి చినకాకాని వద్ద హైలెవల్ చానల్‌లో కలుస్తోంది. గత కొద్ది కాలంగా కాలువలో ఆస్పత్రి నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ వస్తువులు అధికంగా వేస్తుండడంతో కాలువలో చెత్త పేరుకుపోయి మురుగునీరు ముందుకు కదలడం లేదు. దీంతో నగరంలో మురుగుకాలువలలో మురుగునీరు కాలువలపైకి చేరుతోంది.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలో రెండురోజుల కిందట నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చాలా రోజులుగా బోరు మరమ్మతులకు గురైందని తాగునీటికి ఇబ్బందిపడుతున్నామంటూ ఎస్సీకాలనీవాసులు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఆయన బుధవారం సొంతనిధులు వెచ్చించి బోరునకు మరమ్మతులు చేయించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మేడికొండూరు: మండలంలోని శిరిపురం గ్రామానికి చెందిన దొప్పలపూడి నాగరాజు భార్య కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. నాగరాజుకు మండలంలోని విశదల గ్రామానికి చెందిన రూతు అలియాస్ రాణితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో సొంత గ్రామం విశదల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వస్తుండేది. అయితే మంగళవారం శిరిపురంలో భర్త నాగరాజు బజారుకు వెళ్ళి వచ్చేలోగా రాణి ఇంట్లో కనిపించకుండాపోయింది. దీంతో విశదల ఆమె తల్లి దండ్రులకు ఫోన్‌చేసి కనుక్కొనగా అక్కడకు రాలేదని ఆమె తల్లిదండ్రులు తెలిపారు. దీంతో సమీప బంధువుల వద్ద వెతికినప్పటికి ఆచూకీ లభించలేదు. దీంతో భర్త నాగరాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేందుకు, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు మోడీ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. మతోన్మాద బీజేపీ ప్రభుత్వం నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని, కాబట్టి ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు డోకిపర్తి రాజేంద్రబాబు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, ప్రతాప్, చిన్న పాల్గొన్నారు.

పసుపు పంటకు బీమా సౌకర్యం కల్పించాలి



పసుపు రైతులతో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తాడేపల్లి రూరల్: పసుపు పంటకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఏపీ రైతు సంఘం నాయకుడు జొన్నా శివశంకరరావు కోరారు. బుధవారం తాడేపల్లిలోని పసుపు పండించిన రైతులను కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ గత డిసెంబర్‌లో కురిసిన వర్షాల వల్ల పంట దెబ్బతిని దిగుబడి 20 క్వింటాళ్ల లోపే ఉందని, ఎకరానికి లక్షా ఇరవై వేల రూపాయలు, కౌలు 40 వేల రూపాయలు ఖర్చు అవుతోందని, క్వింటా పసుపు ధర 5,500 మాత్రమే ఉందని అన్నారు. ఈ కారణంగా రైతు సుమారు 50 వేల రూపాయల వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పసుపు పంటకు కూడా ఇన్సూరెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కనుల పండువగా భావనారుషి కల్యాణం



తాడికొండ: తుళ్లూరులోని భద్రావతీ సమేత భావనారుషి స్వామి 11వ వార్షిక కల్యాణ మహోత్సవం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. భావనా రుషి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచి పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సమితి కార్యదర్శి

కొత్త పైపులైను ఏర్పాటు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండ ఇందిరానగర్‌లో కార్పొరేషన్ అధికారులు బుధవారం మరో కొత్త పైపులైన్‌కు శ్రీకారంచుట్టారు. కొలనుకొండ పంచాయతీగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైను లోపలి భాగంలో పూడుకు పోవడంతో ఇందిరానగర్‌కు తాగునీటి సరఫరా సరిగా అందించలేకపోతున్నారు. ఎమ్మెల్యే ఆర్కే పర్యటించిన సందర్భంలో ఇందిరానగర్ వాసులు ఆయనకు సమస్యను తెలియజేయడంతో ఆయన ఆదేశాల మేరకు రూ.10 లక్షల వ్యయంతో కొలనుకొండ ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి కొలనుకొండ వరకు జీఐ పైపులైను ఏర్పాటు చేస్తున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, డీసీఎంఎస్ డైరెక్టర్

తాడికొండ: అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి అన్నారు. తాడికొండ రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వ శనగల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న జగనన్న ప్రభుత్వం ఈ ఏడాది శనగల కొనుగోలుకు మద్దతు ధరను పెంచి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తుండటం అన్నదాతలకు వరం అన్నారు. మద్దతు ధర రూ. 5,335కు ప్రభుత్వమే కొనసుగోలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, కంతేరు సర్పంచి బెజ్జం మహేష్ బాబు, నాయకులు తాళ్ల నాగరాజు, తోకల నరసింహారావు, ఏఓ పి.నరసింహారావు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు, అధ్యాపకులు

మోతడక(తాడికొండ): లేడార్ సర్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 12 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు మోతడక సీఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రంగారావు తెలిపారు. మోతడకలోని తమ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఈ ఎంపికలలో సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్న ఆఖరి సంవత్సరం విద్యార్థులు పాల్గొనగా వారిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 12 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కంపెనీ సీఈఓ ఎంఆర్ దినేష్ ఆధ్వర్యంలో హెచ్ ఆర్ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆప్టిట్యూడ్, టెక్నికల్, మరియు ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగ శ్రీనివాసరావు, ఉపాధి కల్పనాధికారి ఎ.శ్రీనివాస్, డాక్టర్ జె.జయకృష్ణ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడు అబ్దుల్ కరిముల్లా

మేడికొండూరు: ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని పేరేచర్ల సత్తెనపల్లిరోడ్‌లోని హరియాలి పెట్రోలు బంకువద్ద బుధవారం చోటుచేసుకుంది. గుంటూరుకు చెందిన రిటైర్డ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అబ్దుల్ కరిముల్లా తన ద్విచక్రవాహనంపై సత్తెనపల్లికి బయలుదేరాడు. మార్గమధ్యలో పేరేచర్ల సత్తెనపల్లి రోడ్‌లోని హరియాలి పెట్రోలు బంకు వద్దకు రాగానే మాచర్ల నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగ నియంత్రణ కోల్పోయి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న అబ్దుల్ కరిముల్లా కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108లో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రాచీన రంగస్థల కళలపై సదస్సు

తెనాలి: స్థానిక చెంచుపేటలోని ఎన్‌సీకేఎస్ కల్యాణ మండపంలో బుధవారం భారతదేశపు ప్రాచీన రంగస్థలంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా నవచైతన్య కళామండలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పీఠాధిపతి దొప్పలపూడి శాలంరాజు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం గురించి వివరించారు.
విశిష్టమైన సాంస్కృతిక సమగ్రత కలిగిన మన వారసత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ పీటర్ థామస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాచీన, ఆధునిక కళలు, నృత్యాలు, ఆచార వ్యవహారాలు, ప్రదర్శనలు, చారిత్రక కట్టడాలు, పురాతత్వ ప్రదేశాల గురించి వివరించారు. సదస్సులో సాంస్కృతిక నిపుణులు, నృత్యకళాకారులు పాల్గొనగా, రిసోర్స్ పర్సన్లు ప్రధాన జానపద కళలు, నృత్యరూపాలు, దృశ్య కళలను వివరించారు. డి.ప్రవీణ్‌పాల్, కమిటీ సభ్యులు చంద్రశేఖర్, డి.శిరీష, జ్యోతిర్మయి, మేరీ, భూపతి, భూమిక తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం

తెనాలిటౌన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు పెయింటింగ్‌లో ఇస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న 42మంది ఆర్యవైశ్య మహిళలకు సర్టిఫికెట్లను సంఘ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘాల కో-ఆర్డినేటర్ మద్దాలి శేషాచలం ప్రదానం చేశారు. పెయింటింగ్ శిక్షకురాలు వాణిశ్రీని సత్కరించారు. ఆర్యవైశ్య మహిళ సంఘ అధ్యక్షురాలు కొండవీటి లక్ష్మీపద్మావతి నిర్వహణలో 30రోజుల పాటు శిక్షణ జరిగిందని వివరించారు. రాబోయే రోజుల్లో ఎంబ్రాయిడరీ, గొలుసులు, మగ్గం వర్క్స్, గ్లాస్ పెయింటింగ్, కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన ఆర్యవైశ్య మహిళలందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధ్యక్షుడు శ్రీనివాసరావు సూచించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అదాలత్

ఫిరంగిపురం: మండలంలోని విద్యుత్ వినియోగదారులు గురువారం మేడికొండూరు మండలంలోని డోగిపర్రు సబ్‌స్టేషన్‌లో నిర్వహించనున్న అదాలత్‌ను వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ పుల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్‌శాఖ ఈఈ చల్లా రమేష్ ఆదేశాల ప్రకారం డివిజన్ పరిధిలోని ఫిరంగిపురం, మేడికొండూరు, ప్రత్తిపాడు, చిలుకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాలకు చెందిన వినియోగదారులు సమస్యలను అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఫిరంగిపురం: పేదలను వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మార్నెళ్ల నిమ్మవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేపూడి గ్రామానికి చెందిన నాయకుడు మార్నెళ్ల రమణారెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా ఫిరంగిపురంలోని నిర్మల్ హృదయ్ అనాథ శరణాలయంలోని పిల్లలకు, కండ్రిక వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు, మహిళలకు బుధవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎం.శివరామిరెడ్డి, నిమ్మవర్ధన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నులకపేట పంప్ హౌస్ దగ్గర మరో సాండ్ ప్రెజర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు డీఈ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 33 లక్షలు కేటాయించి ఈ నిర్మాణం చేపట్టామని, నులకపేట పంప్‌హౌస్‌కు గుంటూరు చానల్ నుంచి రా వాటర్‌ను తీసుకుని మొదట సాండ్ ఫిల్టర్ బెడ్‌లలో నీటిని శుద్ధి చేసి ఆ నీటిని మరల సాండ్ ప్రెజర్ ట్యాంక్‌ల ద్వారా ఫిల్టర్ చేసి బ్రహ్మానందపురం, నులకపేట, బాబూ జగ్జీవన్‌రామ్‌కాలనీ, కృష్ణానగర్ పాత పంచాయతీ కార్యాలయం ఏరియా, తెల్ల క్వారీ, ఎర్ర క్వారీ ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న సాండ్ ప్రెజర్ ఫిల్టర్ సామర్థ్యం సరిపోక తాగునీటి కొరత ఏర్పడిందని, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)కి నులకపేటలో పర్యటించిన సందర్భంగా స్థానికుల నుండి తాగునీటి సమస్యపై వినతిపత్రాలు అందజేయడంతో ఆయన సూచనల మేరకు మరో సాండ్ ప్రెజర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశామని, రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పటికే కొత్త పైపులైన్లు ఏర్పాటు చేశామని, త్వరలోనే కొత్త సాండ్ ప్రెజర్ ట్యాంక్‌ను ప్రారంభించి తాగునీటిని అందించనున్నట్లు పేర్కొన్నారు.